
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.3 । కనిష్ఠం 29.2
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
బుధవారం 26 మార్చి 2025

కాంగ్రెస్‌లో.. ఆధిపత్య పోరు!

- జిల్లాలో పార్టీ సీనియర్, జూనియర్ నేతల మధ్య లొల్లి
- నేతల సీనియార్టీని బట్టి మూడు కేటగిరీలుగా విభజన
- దీని ప్రకారమే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత
- అధిష్ఠానం వద్దకు పరుగులు తీస్తున్న ఆశావహ నేతలు

ఆదిలాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీలో జిల్లా నేతల మధ్య ఆధిపత్య పోరు అధిష్ఠానం పెద్దలకు తలనొప్పిగా మారింది. పార్టీని గాడిలో పెట్టేందుకు హైకమాండ్ చర్యలు చేపట్టింది. ఇటీవల హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా పార్లమెంట్ స్థాయి ముఖ్య నేతల సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అందరి అభిప్రాయాలను తీసుకున్న అనంతరం పార్టీ రాష్ట్ర వ్యవహరాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ పార్టీ బలోపేతంపై ప్రత్యేకదృష్టిని సారించారు. అధికారంలో ఉండి రెండు ఎమ్మెల్సీ స్థానాలు చేజారి పోవడంపై పార్టీలో తీవ్రమైన చర్చ సాగుతోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున పార్టీ అధిష్ఠానం అలర్ట్ అయినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం జిల్లాలో సీనియర్ నేతలంతా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నా.. సమన్వయం కొరవడిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నియోజక వర్గ ఇన్‌చార్జీలు, సీనియర్ నేతల మధ్య ఆధిపత్య పోరు స్పష్టంగానే కనిపిస్తోంది. పాత, కొత్త నేతలను కలుపుకుని ముందుకు వెళ్లక పోవడమే ప్రధాన సమస్యగా మారింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా కాంగ్రెస్‌లో చేరిన పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదంటున్నారు. అగ్రనేతల జిల్లా పర్యటనలో తప్ప నేతలు ప్రజల మధ్య లేకపోవడం పెద్ద సమస్యగా మారిందంటున్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా.. అసలైన కార్యకర్తలకు ప్రాధాన్యతను ఇవ్వడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొందరు నేతలకు నామినెటెడ్ పదవులు దక్కడంతో మిగిలిన ఆశావహ నేతలు తరచూ అధిష్ఠానం వద్దకు పరుగులు తీస్తున్నారు.



నేతల మధ్య పోటాపోటీ

కొత్త పాత నేతల మధ్య ఆధిపత్య పోరు పెరిగి పోవడంతో సీనియర్ నేతలు చక్రం తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీలో తమకున్న పరిచయాలు, సంబంధాలతో పైచేయి సాధిస్తున్నారు. తరతరాలుగా తమ కుటుంబం కాంగ్రెస్‌నే నమ్ముకుని ఉందన్న విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. దశాబ్ద కాలం తర్వాత పార్టీ అధికారంలోకి రావడంతో పదవుల కోసం కాంగ్రెస్‌లో తీవ్రమైన పోటీ కనిపిస్తోంది. గత రెండేళ్లుగా జిల్లా డీసీసీ పదవి భర్తీకాక పోవడానికి నేతల మధ్య ఆధిపత్య పోరే అసలు కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో జిల్లాలో పార్టీని నడిపించే నాయకత్వమే లేకుండా పోయింది. నియోజకవర్గాల్లో ఇన్‌చార్జీలే అన్నీ తామై వ్యవహరిస్తున్నా.. సీనియర్ నేతలు అడ్డుపుల్ల వేయడంతో మరిన్ని విభేదాలకు కారణమవుతోంది. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఇన్‌చార్జీలు వర్సెస్ సీనియర్ నేతల మధ్య పోటాపోటీ కనిపిస్తోంది. ఏదైనా తమ కనుసన్నల్లోనే జరగాలంటూ సీనియర్ నేతలు పట్టుబట్టడంతో పార్టీలో విభేదాలు తరచూ బయట పడుతున్నాయి.

ప్రొటోకాల్ కోసం పైరవీలు

పార్టీ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్, బీజేపీలను వీడి పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరిపోయారు. దీంతో సీనియర్ నేతలంతా ప్రొటోకాల్ పదవుల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. కానీ కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతలకు పదవులు ఇవ్వొద్దంటూ సీనియర్ నేతలు అధిష్ఠానం పెద్దలకు ఫిర్యాదు చేయడం కొత్త వివాదానికి దారి తీస్తోంది. ఇలాంటి పరిస్థితులతో అధిష్ఠానం పార్టీ నేతలను మూడు క్యాటగిరిలుగా విభజించినట్లు తెలుస్తుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పదేళ్ల పాటు పార్టీలోనే కొనసాగిన వారిని ఏ-క్యాటగిరి, అసెంబ్లి ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన వారిని బీ-క్యాటగిరి, అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరిన వారిని సీ-క్యాటగిరిగా విభజించినట్లు ప్రచారం జరుగుతోంది. దీని ప్రకారమే పార్టీ పదవులతో పాటు నామినెటెడ్ పదవులను కేటాయించే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే తాము ఏ క్యాటగిరిలో ఉన్నామో.. తమకే తెలియని పరిస్థితి ఉందని కొంత మంది పార్టీ నేతలు చర్చించుకోవడం కనిపిస్తోంది.

పదేళ్లు దాటిన వారికే పదవులు

కాంగ్రెస్‌లో నామినెటెడ్ పదవిని దక్కించుకోవాలంటే పార్టీలో పదేళ్ల పాటు పని చేసి ఉండాలన్న నిబంధన విధించినట్లు తెలుస్తుంది. నియోజకవర్గ ఇన్‌చార్జీలు తమ దగ్గరి అనుచరులకు నామినెటెడ్ పదవులు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేయగా బెడిసి కొడుతునట్లు తెలుస్తుంది. ఇలాంటి పరిస్థితులతోనే ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకంపై జాప్యం జరుగుతూ వస్తుందన్న టాక్ వినిపిస్తోంది. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారిని పక్కన పెట్టి సీనియర్ నేతలకే అధిష్ఠానం ప్రాధాన్యతనివ్వడం ప్రారంభించింది. దీంతో నామినెటెడ్ పదవులను ఆశిస్తున్న నేతలంతా తీవ్ర నిరాశకు గురవుతున్నారు. బీఆర్ఎస్, బీజేపీలలో

(తరువాయి 6వ పేజీలో...)



మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

ఆంగ్ల భాషపై ప్రావీణ్యాన్ని పెంచుకోవాలి

ఉట్నూర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల భాషపై విద్యార్థులు ప్రావీణ్యాన్ని పెంచుకొని, భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా తెలిపారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్సీ సమావేశ మందిరంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ వక్తల సమ్మేళనాన్ని ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. ఉపాధ్యాయుల ప్రజ్ఞానాన్ని పెంపొందించేందుకు స్వచ్ఛంత సంస్థ చేస్తున్న కృషి ఆదర్శం అన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంస్థ అందిస్తున్న సేవల వల్ల సత్ఫలితాలిస్తున్నాయని అన్నారు. వేసవి సెలవుల్లోను విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. వచ్చే విద్యా సంవత్సరంలోను ఆంగ్లంలో ప్రావీణ్యాన్ని పెంపొందించేందుకు సంస్థతో కలిసి మరిన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.ఏసీఎంజీ జగన్ మాట్లాడుతూ విద్యార్థి తలరాతను మార్చేది ఉపాధ్యాయుడని, శిక్షణ అంశాలను పిల్లలకు అందేలా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యా యులు ప్రదర్శించిన సాంస్కృతిక, ఆంగ్ల నాటికలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంస పత్రాలు జ్ఞాపకలు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఏసీఎంఓలు పుర్క ఉదవ్, రాథోడ్ శివాజీ, జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, ఆర్కదేవరావు, ఎన్జీఓ నిర్వాహకులు రోమిల, నిక్షిత తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఈ నెల27, 28, 29న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బృందం పర్యటిస్తున్నట్లు జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ నెల27న ఉదయం 10గంటలకు గుడిహత్నూర్‌లో అంబేద్కర్, కొమురంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం బాధిత మైనర్ బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాలు, భూమి సమస్యల పై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. డీసీసీ బ్యాంకులో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై చర్చిస్తారని, అనంతరం పట్టణంలోని కొమురంభీం కాలనీలో ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న ఆదివాసీలను కలుస్తారని వివరించారు. తిరిగి రాత్రి గుడిహత్నూర్ మండలంం చిన్న మల్కాపూర్ గ్రామంలో గిరిజన సంస్కృతీ, కళారూపాలను తిలకిస్తారన్నారు. 28, 29 తేదీన ఆసిఫాబాద్, మంచిర్యాలజిల్లాలో పర్యటించనున్నట్లు తెలిపారు. దళిత, గిరిజన సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో ఆదివాసీ నేత పెద్దూరి లక్ష్మణ్, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, బ్యాగరీ వేణు పాల్గొన్నారు.

రేపటిలోగా బ్యాంకు అకౌంట్ వివరాలు అందజేయాలి : జిల్లా అధికారి

ఆదిలాబాద్ అర్బన్, మార్చి25 (ఆంధ్రజ్యోతి): కళాశాలల యజమాన్యాలు వారి బ్యాంకు అకౌంట్ డిటైల్స్ పాస్‌బుక్ కాపీలు ఈ నెల 27లోపు సమర్పించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ విద్యార్థి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ తమ వాటాను డైరెక్ట్‌గా కళాశాలల అకౌంట్‌కు జమ చేయడం కోసం అకౌంట్ డిటైల్స్ ఈ నెల 27లోపు సమర్పించి ఆన్‌లైన్‌లో పొందుపర్చుకోవాలన్నారు. ప్రతీ కళాశాలల లెటర్ హెడ్ పైన అకౌంట్ డిటైల్స్‌తో పాటు స్టేట్‌మెంట్ కాపీని జత చేసి కార్యాలయంలో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

మానసిక ప్రశాంతత అవసరం : ఆడె

బోథ్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మనిషి తన దినచర్యలో నిమగ్నమై యంత్రంగా మారిపోయాడని, అందుకు మానసిక ప్రశాంతత అవసరమని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేంద్ర పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ధన్నూర్ గ్రామంలో జరిగిన వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక మార్గంతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.చంటి, ఆలయ కమిటీ సభ్యులు రమేష్, రాజు, సంతోష్, రవి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వసంతరావు, పార్టీ సీనియర్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, రమణారెడ్డి, అభిరెడ్డిలు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు కర్షక మిత్ర రుణాలు

తలమడుగు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ కర్షక మిత్ర రుణాలను అందించేందుకు కృషి చేస్తున్నామని ఝరి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఎల్మ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై రైతులకు, సభ్యులకు వివరించారు. రైతులందరికీ ఎల్లవేళలా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, అందుబాటులో వచ్చే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా క్రాప్ లోన్స్, ఎల్‌టి లోన్స్, కర్షక మిత్రా లోన్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే యువతకు స్వయం ఉపాధి లోన్స్ కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఝరి సహకార సంఘం ద్వారా బ్యాంకింగ్ సౌకర్యం ఉందని, చిన్న సహకార సంఘం అయినప్పటికీ జిల్లాకు ఆదర్శంగా ఉందన్నారు. అనంతరం లావాదేవీలపై చర్చించారు. ఇందులో సీఈవో ఎస్ రాజు, సిబ్బంది గంగయ్య, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి : సీపీఐ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నిషాన్ ఘాట్, సర్వే నంబర్ 170 కాలనీల్లో కరెంటు సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 9వ రోజుకు చేరుకున్నాయి. కాలనీల్లో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

రేపు శ్యాంపూర్ వారసంత వేలం

ఉట్నూర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న వారసంత వేలం గురువారం ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని కార్యదర్శి ప్రతాప్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జరిగే వారసంత వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5వేల దారవత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు. ఈ వేలంలో కేవలం ఎస్టీలు మాత్రమే పాల్గొనాలన్నారు.

రూ.6 లక్షలకు తై బజార్ వేలం

బోథ్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బోథ్ తై బజార్ అంగడి వేలం పాటను మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తైబజార్ వేలం పాటలో పదిమంది పాల్గొనగా ఆరు లక్షల రూపాయలకు ఈర్నాల ఉమేష్ దక్కించుకున్నారు. గత ఏడాది రూ. నాలుగు లక్షల 11 వేలకు అమ్ముడుపోయింది. ఇందులో ఎంపీడీవో రమేష్, ఎంపీఈవో అతుల్ కుమార్, గ్రామ కార్యదర్శి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

సోనాల, మార్చి25 (ఆంధ్రజ్యోతి): మహిళ రైతులకు ప్రభుత్వం 50శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బోథ్ మండల వ్యవసాయ అధికారి రవితేజ తెలిపారు. బ్యాటరీలు, స్ప్రెయర్లు, పవర్ స్ప్రెయర్లు, రూట్వేటర్లు, కల్టివేటర్లు, కేజ్‌విల్స్ తదితర పనిముట్లను అందించేందుకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహిళ రైతులకు ఆర్థిక రాయితి పై వ్యవసాయ పనిముట్లు అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించినట్లు తెలిపారు. పట్టా పుస్తకం, ఫొటో, ఆధార్‌కార్డుతో కార్యాలయంలో సంప్రదించాలని అధికారి సూచించారు.

పత్తికి మార్కెట్‌లో మంచి డిమాండ్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పత్తికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, దాన్ని పండించే రైతులు వ్యవసాయ శాఖ, కేవీకే శాస్త్రవేత్తలు చెప్పే సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ హైదరాబాద్ డైరెక్టర్ యక్రాద్రి అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కిసాన్ మేళాకు అధికారులు, రైతులు హాజరయ్యారు. కాగా, పత్తి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : ఎంపీడీవో

నేరడిగొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో రాజ్ వీర్ అన్నారు. మంగళవారం మండలంలోని బుద్దికొండ, రాజులతండా, బొందిడి గ్రామాలలో తాగునీటి పంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్య గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలను చేపడుతున్నామన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఎంపీవో లక్ష్మణ్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



వడూర్‌లో బోరు బావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో



సమావేశంలో పాల్గొన్న నీతి ఆయోగ్ కేంద్ర బృందం సభ్యులు, కలెక్టర్



కేంద్ర బృందానికి వినతిపత్రం అందజేస్తున్న బానోత్ గజానంద్ నాయక్

నార్నూర్‌లో నీతి ఆయోగ్ బృందం పర్యటన

- ఎంపీడీవో కార్యాలయం, అంగన్‌వాడీలలో సభ్యుల పరిశీలన

నార్నూర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పీఎం అవార్డ్- 2024 కోసం దేశవ్యాప్తంగా 426 ఆస్పిరేషనల్ బ్లాక్‌లో టాప్-30లో నార్నూర్ ఎంపికైన సందర్భంగా మంగళవారం నీతి ఆయోగ్ కేంద్ర బృందం నార్నూర్ మండలంలో పర్యటించింది. దీనిలో భాగంగా మండలంలోని జామడ, గుంజల, నార్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయం, నాగల్‌కొండలో వారు పర్యటించారు. కాగా, డైరెక్టర్ మృత్యుంజయ ఝా, డిప్యూటీ సెక్రెటరీ శుభోద్ కుమార్‌లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్థానిక గంగా గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను, జ్ఞాపికను అందజేశారు. అనంతరం బృందంలోని సభ్యులు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, శ్యాంమామ్ పిల్లల వివరాలపై ఆరా తీసి, సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత స్థానిక ఉన్నత పాఠశాలలో నీతి ఆయోగ్ కేంద్ర బృందం సందర్శించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ గురించి పాఠశాల సిబ్బంది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, వసతుల గురించి, అలాగే విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య పాఠశాలలో ఉన్న కంప్యూటర్ ల్యాబ్ నిర్వహణ, డిజిటల్ క్లాసెస్ బోధన గురించి సిబ్బంది వివరించారు. పదో తరగతి విద్యార్థుల వంద శాతం ఫలితాల కోసం చేపడుతున్న మిషన్ లక్ష్యం ప్రణాళిక గురించి సైతం వివరించారు. గిరిజన బాలికలలో రక్త హీనతతో బాధపడుతున్నారని, ఈ విషయాన్ని గ్రహించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రారంభించిన గిరిజన మిత్ర కార్యక్రమం గురించి, అలాగే విద్యార్థులకు వారానికి రెండుసార్లు ఇప్పపువ్వు లడ్డు, విటమిన్ సీ, పోలిక్ యాసిడ్, ఐరన్ మాత్రలు అందిస్తున్న విషయాలను సవివరంగా వివరించారు. ఆ తర్వాత ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్ర సందర్శన దృశ్య మాధ్యమాలను చూపిస్తూ కార్యక్రమాన్ని ఉద్దేశాన్ని వివరించారు. ఆంగ్ల భాష నైపుణ్యాభివృద్ధి కోసం చేపట్టిన యంగ్ పోరితెర్స్ క్లబ్ నిర్వహణ గురించి వివరించారు. అందులో భాగంగా ఏడవ తరగతి అమ్మాయి మడావి తబితను యంగ్ ఒరేటర్స్ గురించి తన మాటల్లో చెప్పమన్నారు. విద్యార్థిని చాలా చక్కగా చెప్పడంతో శాలువాతో అభినందించారు. అలాగే పాఠశాలలో ఉన్న సౌకర్యాలను తెలుసుకుంటూ పాఠశాల మొత్తం తిరిగి ప్రతీ గది బృందంలోని సభ్యులు పరిశీలించారు



- డైరెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న కలెక్టర్



చిన్నారులతో మాట్లాడుతున్న నీతి ఆయోగ్ డిప్యూటీ సెక్రెటరీ

పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

- ఆదివాసీ గిరిజన ప్రాంతంలో వెనుకబడిన ప్రాంతం

నార్నూర్: ఆదివాసీ గిరిజన ప్రాంతంలో వెనుకబడిన మండలాలైన నార్నూర్, గాదిగూడల అభివృద్ధికి సహకరించాలని మండలంలో పర్యటించిన కేంద్ర బృందం డైరెక్టర్ మృత్యుంజయ ఝా, డిప్యూటీ సెక్రటరీ సుబోత్ కుమార్‌ను సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కేంద్ర బృందాన్ని, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాలను కలిసి శాలువా కప్పి వినతిపత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం మార్చురీ నిర్మించాలని, కొత్తగా అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లు, డిగ్రీ కళాశాల, రైతన్నలకు పంటలకు నీరు ఇచ్చే విధంగా ఎంపల్లి ప్రాజెక్ట్, కుల్మాద్రి ప్రాజెక్ట్ మంజూరు చేయాలని విన్నవించారు. ఇందులో జేఏసీ మాజీ చైర్మన్ రాథోడ్ ఉత్తమ, శివాజీ అడే, రెడ్డి నాయక్, సురేష్ అడే, దేవ్‌రావు లోకండే, కాంతారావు దుర్గే, దాధే అల్లి, షేక్ అహ్మద్, తదితరులున్నారు.

- ఆదిలాబాద్‌కు వచ్చిన కేంద్ర బృందం సభ్యులు

ఆదిలాబాద్ రూరల్: జిల్లాలోని నార్నూర్ పర్యటనలో భాగంగా మంగళవారం నీతి ఆయోగ్ కేంద్ర బృందం సభ్యులు ఆదిలాబాద్‌కు వచ్చారు. డైరెక్టర్ మృత్యుంజయ ఝా, శుభోద్ కుమార్ డిప్యూటీ సెక్రటరీలను స్థానిక గెస్ట్ హౌస్‌లో కలెక్టర్ రాజర్షిషా మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారితో పలు అంశాలపై చర్చించారు.

ఐసీడీఎస్ ఫ్రంట్ లైన్ సిబ్బందికి అవగాహన

బోథ్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మిషన్ ఉత క్రాస్ కేంద్ర ప్రభుత్వ పథకంపైన అంగన్‌వాడీ సిబ్బందికి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ కోఆర్డినేటర్ మోహన్ మాట్లాడుతూ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని, మొదట తమ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అదిలాబాద్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించడం జరిగిందని, అందులో భాగంగానే బోథ్, జైనథ్, ఉట్నూర్, నార్నూర్ మండలాల అంగన్‌వాడీ కార్య కర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. సీడీపీవో వినూత్న అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలు ఆహారాన్ని అందించే సమయంలో పరిశుభ్రత పాటించాలని కోరారు. ఇందులో సూపర్‌వైజర్లు విమల, లలిత, ప్రమీల జంగుబాయి, శారద, పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ శివాజీ పాల్గొన్నారు.

'న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రవేశ పెట్టాలి'

ఉట్నూర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ చంపాపేట్ ఈస్ట్ మారుతి నగర్‌లో ఈనెల 24న ఇజ్రాయిల్ అనే న్యాయవాదిని యాదగిరి అనే దుండగుడు హత్య చేయడాన్ని నిరసిస్తూ ఉట్నూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో నిత్యం న్యాయం కోసం పని చేస్తున్న న్యాయవాదులపై జరుగుతున్న దాడులను హత్యలను తీవ్రంగా ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి.బాపురెడ్డి, ధీరజ్‌గుప్తా, బానోత్ జగన్ నాయక్, పెందూరు ప్రభాకర్, సీహెచ్ గిరి, శ్రీనివాస్, కుడెల్లి అశోక్, నాతరిరాజు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్ కోర్టులో విధులు బహిష్కరించిన న్యాయవాదులు



లేచిపోయిన ఇంటి పైకప్పు.. చెట్టుకొమ్మలు పడిపోయిన దృశ్యం

ధర్మాజిపేటలో గాలివాన బీభత్సం

ఉట్నూర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీర్సాయిపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ధర్మాజిపేటలో సోమవారం సాయంత్రం ఈదురుగాలుల కూడిన వాన బీభత్సవం సృష్టించిందని గిరిజనులు తెలపారు. గ్రామంలోని 8 ఇళ్ల పైన ఉన్న పైకప్పులు రేకులు గాలికి లేచిపోయి పడిపోవడంతో ఇళ్లలోని వస్తువులు చెడిపోయినట్లు వారు వాపోయారు. కాగా, మంగళవారం ఉదయం విషయం తెలిసిన రెవెన్యూ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శి భూమయ్య గ్రామాన్ని సందర్శించి పరిస్థితి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులు నష్టం అంచనాలు వేస్తున్నారని వివరించారు. ఐటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్ కూడా గాలివానకు దెబ్బతిన్నట్లు గిరిజనులు అధికారుల దృష్టికి తెచ్చారు.

'ఎన్డీఏ ప్రభుత్వంతోనే అభివృద్ధి'

సోనాల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు బోరే రవీందర్ అన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ సహకారంతో రూ.61లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో బోథ్, సోనాలలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను మంగళవారం ప్రారంభించారు. ఇందులో సుభాష్‌సూర్య, రాజేశ్వర్, హారీస్, పోతన్న, రమేష్, రాజేశ్, గంగాధర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం

నేరడిగొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో బోథ్ మండలంలోని కౌట, సాంగ్వి గ్రామస్థులు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చే నెల రెండవ తేదిన జరిగే శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరుకావాలని గ్రామస్థులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇందులో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆడే వసంత్ రావు, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, తదితరులున్నారు.

రైతు ఆత్మహత్యలపై విచారణ

తలమడుగు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల ఇద్దరు రైతులు అప్పుల బాధతో పురుగుల మందు తాగి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను రైతు ఆత్మహత్యల నివారణ కోసం ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం విచారణ చేపట్టారు. కమిటీ సభ్యులైన అదిలాబాద్ ఆర్డీవో వినోద్, డీఎస్పీ జీవన్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఏడీ రామ్ కిషన్, తహసీల్దార్ రాజమోహన్, ఎస్సై అంజమ్మ, వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డిలు కలిసి మండలంలోని ఝరి గ్రామానికి చెందిన రైతు గడం పోతారెడ్డి కుటుంబ సభ్యులను విచారించారు రైతుకు ఎన్ని ఎకరాల పొలం ఉంది? కౌలుకు ఎన్ని ఎకరాలు తీసుకున్నాడు? పెట్టుబడి సహాయం కింద బ్యాంకు లోన్ ఎంత? ప్రైవేట్ అప్పులు ఎన్ని? వివరాలు సేకరించారు. అనంతరం సుంకిడి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగన్న అప్పుల బాధతో ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను త్రిసభ్య కమిటీ సభ్యులు ఇంటికి వెళ్లి వివరాల సేకరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో పాటు సుంకిడి మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, మాజీ ఎంపిటిసి వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి

ఉత్తరం వస్తే.. ఎక్కడ ఇవ్వాలి?

● తికమక పడుతున్న పోస్టల్ సిబ్బంది
● బోథ్‌లో శిథిలావస్థకు చేరిన ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

బోథ్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లో ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం శిథిలం కావడంతో అందులో విధులు నిర్వహించేందుకు సిబ్బంది ఎవరూ రావడం లేదు. సోమవారం ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయానికి పోస్టల్ కార్యాలయం వారు పోస్టులో వచ్చిన ఉత్తరాన్ని పట్టుకొని కార్యాలయం కోసం వెతుకులాడాల్సిన పరిస్థితి నెలకొంది అయితే కార్యాలయంలో ఉండాల్సిన డీఈఏఈ, ఇతర సిబ్బంది అంతా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కార్యాలయంలోని ఉంటున్నారు. అయితే కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15న మాత్రమే అధికారులు వచ్చి జెండాను ఎగురవేసి వెళ్లిపోవడం పరిపాటి. దీంతో మండల వాసులకు బోథ్‌లో ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం ఉందన్న విషయం తెలియకుండా పోయింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉండే ఈ కార్యాలయ సిబ్బంది బోథ్ మండల కేంద్రానికి వచ్చి పోవాలంటే ఇబ్బందికరంగా భావించి ఉద్యోగులంతా ఆదిలాబాద్‌లోనే ఉంటూ విధులు నిర్వహించడం గమనార్హం. మండలంలో శాఖా పరమైన పనులు ఎవరైనా ఉంటే అధికారులు చుట్టపుచూపుగా వచ్చి పనులను పర్యవేక్షించి పోతుంటారు. పనులకు సంబంధించిన ఎంబి రికార్డులన్నీ ఆదిలాబాద్‌లోని నిర్వహించుకుంటారు.

అలాగే, ఆర్‌అండ్‌బి కార్యాలయం పాత భవనం పగుళ్లు తేలి శిథిలం కావడంతో గత పది సంవత్సరాల కాలంగా ఆ శాఖ అధికారులు కార్యాలయం వైపు కన్నెత్తి చూడడం లేదు. అంతేగాక భవనం నిర్మాణానికి అవసరమైన స్థలం ఉన్నా.. కార్యాలయాన్ని నిర్మించాలని ఆ శాఖ అధికారులకు ఆలోచన సైతం రావటం లేదంటున్నారు.



శిథిలావస్థలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

కాగా, నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లో గత పదేళ్ల క్రితం ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కార్యాలయంలో ఉండి విధులు నిర్వహించేవారు. అయితే కార్యాలయం బాగు లేదన్న సాకుతో విధులకు రావటం లేదు. కనీసం జిల్లా అధికారులు స్థానికంగా కార్యాలయం ఏర్పాటు చేసేందుకు అద్దె భవనాన్ని అయినా ఏర్పాటు చేసుకొని విధులు నిర్వహించేలా అధికార పార్టీ నాయకులు, స్థానిక శాసనసభ్యుడు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఘనంగా ఎస్సీ వర్గీకరణ విజయోత్సవాలు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బొక్కగూడలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ఎస్సీ వర్గీకరణ విజయోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ పాల్గొని జెండా ఆవిష్కరణ చేసి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ మూడు దశాబ్దాల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అన్నారు. మందకృష్ణ మాదిగ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టౌన్ ఇన్‌చార్జీ మడిపల్లి మనోజ్, అడ్డెల రాజలింగు మాదిగ, సీనియర్ నాయకులు సందురి వినయ్ సాగర్ మాదిగ, పసుల వేణు కుమార్ మాదిగ, తరుడి శ్రీను మాదిగ, సందూరి, కౌలాస్‌స్వామ్, రొడ్డ చిన్నయ్య, నడికుంట ఇస్తారి, రొడ్డ రమేష్, ఎల్లయ్య, దావుసతీస్, ఈరగొల్ల శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలి

ఇంద్రవెల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో క్షయవ్యాధి నివారణకు అందరూ కృషి చేయడంతో పాటు వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్షయవ్యాధి నివారణకు అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ పూజిత, హెల్త్ సూపర్‌వైజర్ పవార్ సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు సోమోరే నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఒకే దేశం.. ఒకే ఎన్నికతోనే అభివృద్ధి'

ఇంద్రవెల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఒకే దేశం ఒకే ఎన్నికతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రాథోడ్ రితేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక బీజేపీ పార్టీ కార్యాలయంలో బీజేపీ కార్యకర్తలకు ఒకే దేశం ఒకే ఎన్నిక అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికలు నిర్వహిస్తే వ్యయం తగ్గుతుందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ఇంద్రవెల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని, ఎవరైనా అతిక్రమించి ప్రయాణికులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై దుబ్బాక సునీల్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నడిపే ప్రతి ఒక్కరు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ ప్రమాద బీమా కలిగి ఉండాలన్నారు. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపై ఆటోలు ఆపి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించవద్దు అన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించవద్దు అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో అక్రమాలు!

బోథ్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న అవినీతిపై జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదులు చేసేందుకు సిబ్బంది విద్యార్థులను సిద్ధం చేశారు. విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన వివరాల ప్రకారం.. ఆదర్శ పాఠశాలలో అన్ని తానై వ్యవహరిస్తున్న ఓ ఉద్యోగి ఈనెల 19 రాత్రి మూడు గంటల సమయంలో సదరు ఉద్యోగి భర్త హాస్టల్‌లో నుంచి బియ్యం, 15 కిలోల నూనె డబ్బాతో పాటు పప్పులు, తదితర వంట సామగ్రిని తీసుకు వెళ్లినట్లు కొంతమంది సిబ్బంది గుర్తించారు. ఈ విషయం అక్కడ ఉన్న సిబ్బంది బయట పెడతారన్న ఆలోచనతో అందులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి కొంతమంది విద్యార్థులను తన వైపు తిప్పుకొని వంట చేస్తున్న వారు.. వంటలు సరిగా చేయడం లేదంటూ జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసేందుకు శనివారం మధ్యాహ్నం ఆదిలాబాద్ తీసుకుని వెళ్లినట్లు సమాచారం. కాగా సెలవుల్లో ఇంటికి వెళ్లిన విద్యార్థులు ఏవిధంగా ఫిర్యాదు చేశారనేది అంతుపట్టని ప్రశ్నగా మిగిలింది. కాగా బాలికల హాస్టల్‌లోనికి ఏ వ్యక్తులకు సైతం ప్రవేశం ఉండదు.. కానీ అందులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి భర్త మాత్రం రాత్రీపగలు హాస్టల్ లోపలికి వెళ్లి వస్తుంటారని ఫిర్యాదులు ఉన్నాయి. అయితే విధులు నిర్వహించే ఉద్యోగిని కొంతమంది బాలికలతో తన గదిలో వంట చేయించుకుని భోజనాలు చేస్తుందని అంటున్నారు. ఏది ఏమైనా జిల్లా ఉన్నతాధికారులు హాస్టల్‌లో జరుగుతున్న తతంగంపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కొంతమంది వ్యక్తుల పెత్తనం చెలాయిస్తుండడంతో అడ్డగోలుగా వ్యవహారం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు

(5వ పేజీ తరువాయి...)

మంచి పలుకుబడి, గుర్తింపు ఉన్నా.. ఆ పార్టీలను వీడి అధికార పార్టీ కావడంతో కాంగ్రెస్‌లో చేరిపోయారు. అయినా ఆశించిన ప్రాధాన్యత దక్కడం లేదని వాపోతున్నారు. తాజా మాజీ ఎమ్మెల్యేల పరిస్థితి మరీ అధ్వానంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశంలో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జీ ముందే తమ ఆవేదనను వెల్లబోసుకున్నట్లు తెలుస్తుంది. తాజా మాజీ ఎమ్మెల్యేలైనా నియోజకవర్గ ఇన్‌చార్జీలు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సీనియార్టీని బట్టీ పార్టీ పదవులు, నామినెట్ పదవులను ఇస్తే కొత్తగా చేరిన నేతల పరిస్థితి ఏమిటన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మొత్తానికి కాంగ్రెస్‌లో సొంత పార్టీ నేతలే అధిష్ఠానం తీరుపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

'టేకు కలపను తరలిస్తే కఠిన చర్యలు'

సిరికొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి):ఎవరైనా సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్ పరిధి నుంచి అక్రమంగా టేకు కలపను తరలిస్తే చట్టరిత్యా అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్నూరు ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర హెచ్చరించారు. సోమవారం సాయంత్రం సిరికొండ మండలం సిరిచెల్మ కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని వాయిపేట్ సెక్షన్ గోపాల్‌పూర్ బీట్ అటవీ ప్రాంతం నుంచి మారుతీగూడ గ్రామానికి చెందిన కొందరు అక్రమార్కులు టేకు చెట్లను నరికి దుంగలను ఎడ్లబండిపై తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నామన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం గోపాల్‌పూర్ బీట్ పరిధిలోని అటవీ ప్రాంతం నుంచి ఐదు ఎడ్లబండ్లపై టేకు దుంగలను తరలిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు కలప స్మగ్లర్లను పట్టుకొని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇట్టి కలపను ఇచ్చోడ కలప డిపోకు తరలించినట్టు ఆయన పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.లక్షా 28 వేల 513 ఉంటుందని అని తెలిపారు. అటవీ ప్రాంతం నుంచి ఎవరైనా కలప స్మగ్లర్లు అడవులను నరికి, టేకు కలపను తరలించినట్లయితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో సిరిచెల్మ టైగర్‌జోన్ అటవీ క్షేత్రాధికారి నాగస్వామి, ఇంద్రవెల్లి ఎఫ్ఆర్వో సంతోష్, సిరికొండ ఇంచార్జీ డీఆర్వో నరేష్, టాస్క్‌ఫోర్స్ అధికారి కవిత, వాయిపేట్ ఇన్‌చార్జీ సెక్షన్ అధికారి చంద్రారెడ్డి, బీట్ అధికారులు సంతోష్, సజన్‌లాల్, శ్యాంసుందర్, అవినాష్, హీరాలాల్, విజయ్‌కుమార్, బేస్‌క్యాంప్ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో అక్కాచెల్లెళ్ల అదృశ్యం

మావల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కాలనీకి చెందిన అక్కాచెల్లెళ్ల అదృశ్యమైన ఘటన మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సు చేస్తున్న ఓ బాలిక తన అక్కతో కలిసి ఇంటి నుంచి పరీక్షకు హాజరైనందుకు సోమవారం ఉదయం బయలుదేరారు. కాగా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తెలిసిన చోట, బంధువుల ఇళ్లలో వెతినా ఫలితం లేక పోవడంతో మావల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధిత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షెడ్ల నిర్మాణంపై కొలతలు తీసిన ఆర్‌అండ్‌బీ

బోథ్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇటీవల నూతనంగా వెలసిన పలువురి షెడ్ల నిర్మాణం పైన జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో మంగళవారం ఆర్‌అండ్‌బి అధికారులు కొలతలు తీయడం జరిగింది. ఆర్‌అండ్‌బి స్థలంలో షెడ్లు ఉంటే నోటీసులు ఇస్తామని ఈ సందర్భంగా పాల్గొన్న జేఈ మనీష్ వివరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

ఏడో రోజుకు సీసీఐ సాధన కమిటీ దీక్షలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరిస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ మల్లేష్, కో కన్వీనర్ నారాయణ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎదుట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. యువజన నాయకులు వారికి మద్దతు తెలిపారు. కేంద్రం సీసీఐ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారం కోసం ఆశా కార్యకర్తల ఆందోళన

● ప్రధాన రోడ్డు మార్గం మీదుగా ర్యాలీ ● బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట మౌన ప్రదర్శనలు ● పలు మండల కేంద్రాల్లో అరెస్టులు



భైంసాలో మౌనప్రదర్శన నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

భైంసా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్లు నేరవేర్చాలని మంగళవారం భైంసాలో ఆశ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు. ఉదయం వేళలో స్థానిక విశ్రాంతి భవనం ఎదుట బేటి జరిపిన డివిజన్ పరిధిలోని ఆశ కార్యక్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు మరకంటి విజయ, బి.లక్ష్మీ, బి.మౌనిక, హెచ్.ఉజ్వలల సారథ్యంలో ఆందోళనలకు దిగారు. స్థానిక విశ్రాంతి భవనం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ ఎదుట ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట మౌన ప్రదర్శనలు నిర్వహించారు. ఆశ కార్యకర్తల ఆందోళనలకు జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు సుంకెట మహేష్‌బాబు మద్దతు పలికి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆశ కార్యకర్తల ప్రతినిధులు, జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు సుంకెట మహేష్ బాబులు మాట్లాడుతూ రేవంత్ సర్కార్ ఎన్నికల సందర్భంలో ఆశలకు ఇచ్చిన హమీలను అమలుపరచడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నిస్తే ఆశ కార్యకర్తలపై నిర్బంధకాండ కొనసాగిస్తూ పోలీసు శాఖతో భయభ్రాంతులకు గురి చేయిస్తున్నారని విమర్శించారు. హమీలను అమలు చేయకపోగా సమస్యలు పరిష్కారం కోసం శాంతియుత దోరణి విధానాలతో ఉద్యమిస్తే అణచివేత విధానాలను అవలంబించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఎన్నికల మెనిఫెస్టోలో పెర్కొన్నట్లుగా ఆశలకు రూ.18 వేల వేతనం చెల్లిస్తూ ఇతర సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు.

అరెస్ట్ అక్రమం : సీపీఎం

నిర్మల్ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించిన ఆశా కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేయడం అక్రమమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. నూతన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో అరెస్ట్, లాఠీచార్జ్‌ను ఖండించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పాలన గత ప్రభుత్వం మాదిరిగానే ఉందన్నారు. కనీస వేతనం 18 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



ముథోల్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

నిర్మల్ జిల్లా కేంద్రంలో నిరసన

ముథోల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ముథోల్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు తమ నిరసనను వ్యక్తం చేశారు. అతి తక్కువ పారితోషకంతో పని చేస్తూ ఆరోగ్యశాఖలో కీలక పాత్ర వహిస్తున్న పట్టించుకోకపోవడంచాలా దారుణమన్నారు. ఆశావర్కర్స్‌కు ఫిక్స్ వేతనం రూ. 18,000లు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.50 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి నశించాలని, పోలీసుల జులుం నశించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 వరకు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జీతాలు పెంచమని అడిగితే లాఠీచార్జ్,,సరికాదు

ఖానాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జీతాలు పెంచమని అడిగితే ఆశా వర్కర్లపై లాఠీచార్జ్ చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. ఆశావర్కర్లపై సోమవారం హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయం వద్ద పోలీసులు జరిపిన లాఠీచార్జ్‌ను ఖండిస్తూ మంగళవారం ఖానాపూర్‌లోని పాత బస్టాండ్ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేసి వినతి పత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... ప్రజాపాలన అంటూ ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలపై లాఠీచార్జ్ చేయడం, అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ నెల 24వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన ఆశావర్కర్ల చలోహైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనకుండా జిల్లాలో ఉన్న ఆశావర్కర్లను పోలీసులు అత్యుత్సాహంతో ముందస్తు అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశా వర్కర్లకు ప్రతి నెల ఫిక్స్ వేతనం రూ. 18,000 అందజేసేలా బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించాలన్నారు. ఆశా వర్కర్లకు రూ. 50 లక్షల బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలన్నారు. పారితోషకం లేని పనులను ఆశా వర్కర్లతో చేయించవద్దని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పిస్తూ పండుగలకు వారాంతపు సెలవులకు సర్కారు సర్క్యులర్లు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగామణి, మండల నాయకులు రజిత, త్రివేణి, వినోద, మమత, లక్ష్మీ, తదితరులున్నారు.



ఖానాపూర్‌లో ఆశావర్కర్ల నినాదాలు

డిమాండ్లను నెరవేర్చాలి

కుంటాల, మార్చి, 25 : (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఆశా కార్యకర్తల సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం మండల కేంద్రం కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తల సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు.

ఐకేపీ వీవోఏల ముందస్తు అరెస్ట్

లక్ష్మణచాంద, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో చేయ తలపెట్టిన ఐకేపీ వీవోఏల నిరసనను భగ్నం చేయటం కోసం స్థానిక వీవోఏలను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వీవోఏల మండల అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ... మాకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, హెచ్ఆర్ కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ప్రభాకర్‌తో పాటు సంగెం గంగాధర్, రవి, నవీన్, సంధ్య, ముత్తవ్వ, కవిత, తదితరులు ఉన్నారు.

'ఒకే దేశం - ఒకే ఎన్నిక'కు మద్దతు ఇవ్వండి

● బీజేపీ జిల్లా నాయకులు సత్యనారాయణగౌడ్



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న వల్లకొండ సత్యనారాయణ గౌడ్

లక్ష్మణచాంద, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అమలు చేయబోతున్న 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' విధానానికి మద్దతు ఇవ్వాలని బీజేపీ జిల్లా నాయకులు వల్లకొండ సత్యనారాయణ గౌడ్ మంగళవారం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ విధానం వలన కేవలం మూడు నెలల్లో పార్లమెంట్, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తవుతాయన్నారు. తద్వార సమయంతో పాటు ధనం కూడా ఆదా అయ్యి దేశాభివృద్ధికి ఆస్కారం ఉంటుందన్నారు. కావునా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ విధానం పట్ల ప్రజలలో చైతన్యం తీసుకొచ్చి 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుల ఆశా కార్యకర్తలు చేస్తున్న ఉద్యమానికి బీజేపీ నాయకులు మద్దతు పలికారు.

వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై సమావేశం

కుబీర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై మంగళవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగరం నారాయణరెడ్డి, ప్రధానవక్తగా కేశెట్టి అశోక్‌లు పాల్గొని మాట్లాడారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ విధానం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ విధానంతో ఎన్నికల ప్రక్రియ ద్వారా కాలం వృధా కాకుండా మరింత అభివృద్ధికి తోడ్పడుతుందని, అదే విధంగా ఖర్చు తగ్గుతుందని తెలిపారు. ఈ విధానంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఏశాల దత్తాత్రి, కార్యక్రమ కన్వీనర్ వైద్యనాథ్, కో కన్వీనర్ సాయినాథ్ జిల్లా కౌన్సిల్ మెంబర్ పండిత్ జాదవ్, బొమ్మెడ మల్లేష్, శంకర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

సారంగాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు కాల్వ నరేష్ అన్నారు. మంగళవారం మండలంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని 'ఒకే దేశం ఒకే ఎన్నిక' నినాదాన్ని తీసుకువచ్చారని, ఈ నినాదంతో దేశ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు కొరసాగుతున్నాయని పేర్కొన్నారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషిచేసి గెలుపే ధ్యేయంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్ లాల్, సాగర్ రెడ్డి, గంగారెడ్డి, రాజేశ్వర్, సాహెబ్ రావు, ఎల్లన్న, తిరుమల చారి, భూమారెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సోన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండల కేంద్రంలో ఒకే దేశం - ఒకే ఎన్నిక విధానానికి మద్దతు ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం ఎక్కువ నిశ్చయతను తెస్తాయని, తరచుగా జరిగే ఎన్నికలు అనిశ్చితి వాతావరణాన్ని సృష్టిస్తాయన్నారు. ఎన్నికలను సమకాలీకరించడం వలన అధిక ఆర్థిక స్థిరత్వం, వృద్ధి ఏర్పడుతుందన్నారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్ రెడ్డి, బీజేపీ దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, సోన్ మండల కన్వీనర్ సందుగారి నవీన్, కోకన్వీనర్ పెసరి గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు డా.నరేష్, గడ్డం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు

ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలి

ఖానాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌లోని గాంధీనగర్ ఎస్సీ బాలుర హాస్టల్‌లో వసతి పొందుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ మెడపట్ల నితిన్ డిమాండ్ చేశారు. మంగళవారం వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వసతిగృహం నుండి వారు చదువుతున్న పాఠశాలకు 1.5 కిలోమీటర్ల దూరం ఉన్నందున విద్యార్థులు నిత్యం నడిచి వెళ్లడం ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పిస్తే నిత్యం పాఠశాలకు వెళ్లే వచ్చేందుకు విద్యార్థులకు నడిచి వెళ్లే తిప్పలు తప్పుతాయన్నారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులకు రెగ్యులర్‌గా మెడికల్ టెస్టులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



ఖానాపూర్ గాంధీనగర్‌లో మాట్లాడుతున్న నితిన్

పాత వెడ్డింగ్ కార్డులతో

గ్రీటింగ్ కార్డులు తయారు చేసిన విద్యార్థులు

సోన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రాజెక్టు వర్క్ క్రింద పాత వెడ్డింగ్ కార్డులతో రానున్న ఉగాది పండుగ సందర్భంగా తెలుగు సంవత్సర గ్రీటింగ్ కార్డులను తయారు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో పరమేశ్వర్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు మంగమ్మ, రాధా, జ్యోతి, విజయ, వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



తయారు చేసిన గ్రీటింగ్ కార్డులతో విద్యార్థులు




ఫ్లోరైడ్ నీరు ఉన్న బోరు



పని చేయకుండా ఉన్న ఆర్ఓ ప్లాంటు ఇదే..


అధ్వానంగా ఉన్న కన్నాపూర్ రోడ్డు ఇదే..


● కన్నాపూర్ ప్రజల దాహార్తి తీరుస్తున్న మంచినీటి బావి

అభివృద్ధికి దూరంగా కన్నాపూర్

● తాగునీటికి కటకట ● బోర్లలో ఫ్లోరైడ్ నీరు ● సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు ● ఆంధ్రజ్యోతి విలేజ్ విజిట్‌లో వెల్లడి

ఉట్నూర్, మార్చి25 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని కన్నాపూర్ గిరిజన గ్రామం అభివృద్ధికి దూరంగా ఉండిపోతోంది. గ్రామంలో అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన విలేజ్ విజిట్ ద్వారా అక్కడి గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు మంచినీటితో పాటు రోడ్డు సమస్య తీవ్రంగా ఉంది.

● కొత్తగా ఏర్పడిన పంచాయతీ

ఉట్నూర్ మండలానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న కన్నాపూర్ గ్రామ పంచాయతీ ఐదేళ్ల క్రితమే కొత్తగా ఏర్పాటైంది. కన్నాపూర్ గ్రామంలో 80 ఇళ్లు ఉండగా, 300కు పైగా జనాభా జీవనం సాగిస్తోంది. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో మరో నాలుగు కుగ్రామాలు ఎర్రగుట్ట, ఉమాపతికుంట, రాజులమడుగు, రాంజీగూడలు అన్నీ దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్నాయి. కన్నాపూర్ పంచాయతీలోని గ్రామాలకు తాత్కాలిక రోడ్లు అందుబాటులో ఉన్నాయి. ఈ రోడ్డుపై అక్కడక్కడ నిర్మించిన వంతెనలు వర్షాలకు కొట్టుకుపోగా ఉన్న రోడ్లు సైతం గండ్లు పడి అధ్వానంగా మారాయి. వంతెనల నిర్మాణాన్ని అటవీ శాఖ అడ్డుకోగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చొరవ చూపించడంతో వంతెనల నిర్మాణం పూర్తయినా రోడ్డు పనులను మాత్రం అడవీశాఖ ముందుకు పడనీయడంలేదు. ఫలితంగా సరైన రవాణా సదుపాయాలు లేక ఎర్రగుట్ట, రాజులమడుగు గ్రామాలు ఏరిపారేసినట్లు అభివృద్ధికి దూరంగానే ఉన్నాయి.

● ఏటా మంచినీటి ఎద్దడి

కన్నాపూర్ గ్రామంలో మూడు బోరుబావులు ఉన్నాయి. అయితే ఆ మూడు బోర్లలోనూ కూడా ఫ్లోరైడ్ నీరు వస్తుండడంతో గిరిజనులు బోర్ల నీరు తాగడం లేదు. దీన్ని గమనించిన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్ బీఆర్ఎస్ హయాంలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా గ్రామంలోని మంచి నీటి సమస్య పరిష్కారం కోసం ఆర్ఓ ప్లాంటు ఏర్పాటు చేయించారు. కానీ అది కొన్నిరోజులు కూడా పని చేయలేదు. ఆర్ఓ ప్లాంటు మోటారు చెడిపోవడంతో ప్రజలకు ఏ మాత్రం ఉపయోగంలో లేకుండా పోయింది. గ్రామంలో ఉన్న పాత మంచినీటి బావి ద్వారానే గిరిజనులు మంచినీరు తాగడానికి ఉపయోగిస్తూ బోరుబావుల నీరు ఇతర పనులకు వినియోగిస్తున్నారు. గత సంవత్సరం ప్రత్యేక బోరు వేసి సింథటిక్ ట్యాంకులను ఏర్పాటు చేసి గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు మంచినీటి వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటికీ ఆ నీరు కూడా గిరిజనులు తాగడానికి ఉపయోగించడం లేదు. మంచినీటి బావిలో సైతం నీళ్ల అడుగంటుతున్నాయని వాగులో చెలిమె వేసుకుని నీరు తాగాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● నిర్మాణంలో ఉన్న పంచాయతీ భవనం

ఉట్నూర్ ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేశారు. గత యేడాది కాలంగా కొన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినా అనివార్య కారణాలతో పనులు ముందుకు సాగడం లేదు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ జోక్యం చేసుకోవడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. కన్నాపూర్ గ్రామానికి తారురోడ్డు మంజూరు చేయడంతో పాటు మంచినీటి ఎద్దడి తీర్చడానికి చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ విషయం గ్రామ కార్యదర్శి పండరి మాట్లాడుతూ మంచినీటి ఎద్దడి తీర్చడానికి ఆర్ఓ ప్లాంటుకు ఉన్న బోరు మోటార్ పనులు చేయిస్తున్నామని, ఈ వేసవిలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా గిరిజనులకు మంచినీరు అందిస్తామని తెలిపారు. మిషన్ భగీరథ ట్యాంకు ద్వారా కూడా నీరు అందించడానికి పైపులైన్లకు మరమ్మతులు చేయిస్తున్నామని వెల్లడించారు.

బోర్లు ఉన్నా ఫలితం లేదు..

● జంగు, కన్నాపూర్



గ్రామంలో బోరు బావులు ఉన్నా ఫలితం లేకుండా పోయింది. బోర్లలో ఫ్లోరైడ్ నీరు ఉందని చెప్తున్నారు. దీంతో ఆ నీటి తాగడానికి ఉపయోగించడం లేదు. బయటి పనులకు వినియోగిస్తున్నాం. అధికారులు స్పందించి మాకు మంచినీరు సదుపాయం కల్పించాలి.

బావి నీరు తాగుతున్నాం..

● నైతం చిత్రు, కన్నాపూర్



గ్రామంలోని బోరుబావుల నీరు తాగడంలేదు. బావి నీరు తాగుతున్నాం. బావిలో నీరు కూడా అడుగంటుతోంది. బావిలో నీరు అయిపోతే వాగులో చెలిమె వేసుకుని గ్రామస్థుల దాహార్తి తీర్చుకోవాల్సి వస్తోంది. మిషన్ భగీరథ పథకం అంతంత మాత్రమే. ఆర్ఓ ప్లాంటు పనిచేయడం లేదు. బాగు చేయిస్తే బాగుంటుంది.


శబరిమాత చిత్రపటంతో పల్లకి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో శబరిమాతకు పూజలు

తలమడుగు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లి(కే) గ్రామంలో మంగళవారం శబరిమాత ఆలయ 37వ వార్షికోత్సవం సందర్భంగా శబరిమాతకు భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో శబరిమాత చిత్రపటంతో పల్లకి ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ముడుపు మనీష్ రెడ్డి పాల్గొని పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరమాంస సద్గురు శబరిమాత చూపినమార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కోరారు. ఆధ్యాత్మిక మార్గంతోనే మనసుకి మనశ్శాంతి కలుగుతుందన్నారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధి కోసం తనవంతుగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. భజన బృందాల సభ్యులు ఆలపించిన భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్థులు ఈశ్వర్‌రెడ్డి, మాజీసర్పంచ్ రమేష్‌రెడ్డి, పాండు, రాంచందర్‌రెడ్డి, లింగారెడ్డి, స్వామి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూజ నిర్వహిస్తున్న భక్తులు, గ్రామస్థులు

వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణం


కాషాయ ధ్వజాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు

ఖానాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆవరణలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నలుమూలల నుంచి హనుమాన్ దీక్ష స్వాములు భారీగా తరలివచ్చి ఈ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. గురుస్వామి పెరక గంగాధర్ పర్యవేక్షణలో చాలీసా పారాయణం కొనసాగింది. అంతకుముందు ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కామోజీ శ్రీనివాస్ కాషాయ ధ్వజాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చాలీసా పారాయణాన్ని నిత్యం పాటించడం ద్వారా ఆధ్యాత్మిక భావాలు పెంపొందుతాయన్నారు. యువత సన్మార్గంలో నడిచేలా ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమా లు ఉపయోగపడతాయని అన్నారు. చాలీసా పారాయణం అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, ఆలయ కమిటీ నిర్వాహకులు అజయ్ కుమార్, జగన్, శేషాద్రి, బాల్యాల రాజశేఖర్, మాలెపు రాజశేఖర్, కడార్ల వెంకటేష్, సింహరాజుల బ్రహ్మం, బాల్యాల రమేష్, తదితరులున్నారు.



ట్రాఫికర్!





ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని తాంసి బస్టాండ్ వద్ద రైల్వే గేటు పడిందంటే రాకపోకలు సాగించేవారి వాహనదారులు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గేటు పడితే సుమారు 15 నుంచి అరగంట పాటు తెరుచుకోవడంలేదు. దీంతో భారీస్థాయిలో వాహనాలు నిలిచిపోతున్నాయి. మరో వైపు రాత్రివేళల్లో లైట్లు వెలగకపోవడంతో అక్కడంతా చీకటి అలుముకుంటుంది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. వాహనాలన్నీ ఒకే దగ్గర గూమిగూడ ఉండడంతో దొంగతనాలు జరిగే ఆస్కారం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. తాంసి బస్టాండ్ వద్ద రాత్రివేళల్లో కనిపించిన చిత్రమిది.

● ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఇసుక తోడేళ్లు..!

● తలమడుగులో జోరుగా ఇసుక దందా ● వాగుల్లో అక్రమంగా తవ్వకాలు ● ● పట్టించుకోని అధికారులు

తలమడుగు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలో జోరుగా ఇసుక దందా జోరుగా సాగుతోంది. కొందరు అక్రమార్కులు వాగుల్లో ఇసుకను తోడేస్తున్నారు. ఎండలు క్రమంగా పెరుగుతుండడంతో వాగుల్లోని నీరు తగ్గిపోతోంది. దీంతో కొందరు వాగుల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా దందాను సాగిస్తున్నా సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని సుంకిడివాగులో ప్రతీ రోజు భారీ యంత్రాలతో ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సుంకిడి వాగులో నీరుతగ్గిపోవడంతో ఇసుక తవ్వకాలు జోరందుకున్నాయి. రోడ్డు పక్కనే వాగు నుంచి ఇసుకను తీసుకుపోతున్నా ఇప్పటివరకు అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలు తావిస్తోంది. అంతేకాకుండా ఇసుకదందా వ్యాపారులు, రాజకీయ నాయకులు అండదండతో మరింత రెచ్చిపోయి రాత్రిపగలు తేడా లేకుండా ఇసుక దందాను సాగిస్తున్నారు. దీనికితోడు మండలంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం దాదాపు రూ.6 కోట్ల నిధులు మంజూరు కావడంతో రోడ్డు పనుల పేరా ఇసుక వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు జరుపుతూ ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. మండలం రుయ్యాడి, కజ్జర్ల, బరంపూర్, కుచలాపూర్, దేవాపూర్, తలమడుగు, జరీ, ఖోడదు తదితర గ్రామల వాగుల నుంచి ఇసుకను తీసుకెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అధికారుల స్పందించి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను తవ్వకాలను అడ్డుకోవాలని, పర్యావరణానికి నష్టం కలిగించే చర్యలను అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సుంకిడి వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక




ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న దృశ్యం

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nirmal Branch, Dist. Nirmal agreed to accord Loan to Shaik Ikramoddin S/o Shaik Madhar, Aged 48 Yrs, Occ:Business, R/o H.No.4-90, Sonala (V) Sonala (M), Adilabad (Dist) mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within 5 days of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.

Hence this notice

SCHEDULE OF THE PROPERTY

Open place comprised under Sy No.190/అ admeasuring 3168 Fts equal to 352 Sq.Yds or say 294.3 Meters situated at Sonala Village, Sonala Mandal, Adilabad (Dist), within the limits of Gram Panchayat Sonala under the jurisdiction of Regn.District Adilabad and Registration Sub-District: Boath.

Boundaries as follows

East : Plot of Shaik Ikramoddin, **West** : Govt Land and Plot of Soma Ramana Reddy, **North:** Sonala to Kinwat Road **South:** House of Rukman Singh,

Sd/- R. Jagadishwer Rao
B.Com, LLB.,Advocate,
H.No. 6-2-67, Subhash Nagar,
Nizamabad, Ph: 9848094409

PUBLIC NOTICE

General public are hereby infommed that my client M/S Shriram finance Ltd, Adilabad branch, agreed to accord loan to Borrower : Sri. PUSAALA VENUGOPALA CHARY S/o NADHA BRAMHA CHARY. R/o, H.NO: 304, SIDDIVINAYAKA APARTMENT PANJESHA GALLI , Mandal & Dist : Adilabad. Property holder : Smt. PUSAALA RADHIKA W/o.VENUGOPALA R/o, H.NO: 3-8-73, Tirpelli, Mandal & Dist : Adilabad, R/o.by mortgage of the schedule property mentioned below. The above propective loanee agreed to create first charge against property mentioned below in favour of my client company. if any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 5 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my clait company and my client shall proceed further for according above loan.

SCHEDULE

The Open plot Allotted House bearing M.P.L Door No.1-5-59/A/19, Measuring 25' x 27' = 675 Sq Fts = 75 Sq Yards = 62.70 Sq Miters. On Plot No.19, in Sy No. 21 & 22. Assessment No.1094032073. Situated at Ward No.1, Block No.5, Sonar Colony (Khanapur), locality of Revenue Village Khanapur, Mandal & District Adilabad. Within the limits of Adilabad Municipality. Within the jurisdiction of District, Sub-District and Registration District Adilabad.

Bounded by:

East: House of T.Narsingh, **West**: Open Plot of R.Bharathi, **North:** Road, **South:** Open Land.

Sd/- BIPIN KUMAR PATEL Advocate,
Adilabad. Cell: 9440005500





చారి కిరికిరి



- ఎవరికీ అంతుచిక్కని కాంగ్రెస్ నేత వేణుగోపాలచారి అంతరంగం
- మళ్లీ క్రియాశీలక రాజకీయాల వైపు అడుగులు
- రానున్న ఎన్నికల్లో జిల్లా నుంచి పోటీ చేస్తానని ప్రకటన
- పార్టీ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశం
- స్పందించని డీసీసీ వర్గాలు

నిర్మల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అధికార కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తల కన్నా నాయకుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుండడం ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. ఆ పార్టీలో ఇటీవల చేరిన, చేరుతున్న నాయకులంతా రాజకీయాల్లో అత్యంత సీనియర్‌లు కావడం ప్రస్తుతం చర్చకు కారణమవుతోంది. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఈ నేతలంతా అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీలో సీనియర్ నాయకులుగా కొనసాగడమే కాకుండా కీలక పదవులను సైతం నిర్వర్తించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా తమ రాజకీయ సీనియార్టీ ఆధారంగా ఆ పార్టీలో ప్రాధాన్యతను దక్కించుకునేందుకు పోటీ పడుతుండడం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారుతోంది. మొదట బీఆర్ఎస్ పార్టీ హయాంలో మంత్రిగా కొనసాగిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆ తరువాత బీఆర్ఎస్ పార్టీ ఢిల్లీ అధికార ప్రతినిధిగా, ఐడీసీ చైర్మన్‌గా వ్యవహరించిన మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారితో పాటు మరికొంత మంది సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటి వరకు ప్రస్తుత డీసీసీ అధ్యక్షులు పార్టీకి అన్ని తానై నిలవడమే కాకుండా ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ కూడా చేశారు. తానూ ఓటమి పాలైనప్పటికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆయన మరింత క్రియాశీలకమవ్వడమే కాకుండా కార్యకర్తలందరికీ అండగా నిలుస్తున్నారు. దీంతో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన చాలా మంది సీనియర్ నాయకులు, ఆ పార్టీ కార్యకర్తలను సైతం కాంగ్రెస్ పార్టీలో చేర్పించి పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారు. అయితే ఇటీవల వేణుగోపాలచారి తాను రాజకీయాల్లో మరింత క్రియాశీలకమవుతానని ఎన్నికల్లో సైతం పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానంటూ చేసిన ప్రకటన కాంగ్రెస్ పార్టీలో కొత్త చర్చకు దారి తీస్తోంది. అయితే మొన్నటి టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి వేణుగోపాలచారి నియోజకవర్గంలో కొంత క్రియాశీలకంగా వ్యవహరిస్తూనే ఎన్నికల అనంతరం ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. వేణుగోపాలచారి చేసిన ప్రకటనపై డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఇప్పటి వరకు స్పందించకుండా తనపని తాను చేసుకుపోతున్నాడు. శ్రీహరిరావుతో పాటు మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఇతర సీనియర్ నాయకులు సైతం చారి ప్రకటనపై ఎలాంటి కామెంట్స్ చేయలేదు. అయితే మొదటి నుంచి నాయకుల సంఖ్యతో సతమతమవుతున్న కాంగ్రెస్ పార్టీకి వేణుగోపాలచారి చేసిన ప్రకటన ఆ పార్టీలో కొంత గందరగోళానికి కారణమవుతోంది.

అర్థం కానీ చారీ అంతరంగం

కాగా తెలుగుదేశం పార్టీ హయాంలో రాష్ట్రమంత్రిగా, కేంద్రమంత్రిగా చక్రం తిప్పి అపర రాజకీయ చాణక్యునిగా పేరు గడించిన వేణుగోపాలచారి క్రమక్రమంగా తన రాజకీయ ప్రభాల్యాన్ని తగ్గించుకుంటూ వస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో కొంతకాలం ఆయనకు అత్యంత ప్రాధాన్యత లభించినప్పటికీ ఆ తరువాత ఆ పార్టీ ఆయనను ఆశించినంతగా పట్టించుకోలేదు. ఢిల్లీలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినప్పటికీ ఆ తరువాత ఆయనపై పెద్దగా పార్టీ దృష్టి సారించలేదు. చిట్ట చివరకు ఆయనను ఐడీసీ కార్పోరేషన్ చైర్మన్ పదవికి మాత్రమే బీఆర్ఎస్ పార్టీ పరిమితం చేసింది. దీని కారణంగా వేణుగోపాలచారి ఆధిపత్యం క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఇటీవలే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరిన వ్యవహారం అంతటా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల హయాంలో ఆయన రాజకీయ దిగ్గజంగా వెలుగొందగా అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని ఆయన అనుచరులే కాకుండా ఆయన అభిమానులు సైతం జీర్ణించుకోలేకపోయారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుంచి పార్టీ అధిష్టానం ఆయనకు పెద్దగా ప్రాధాన్యతనివ్వలేదు. అయితే జిల్లాలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు మాత్రం ప్రాధాన్యతనిచ్చినప్పటికీ పార్టీ కార్యకర్తల్లో మాత్రం ఆయనకు ఆశించిన ఆదరణ లభించలేదు. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి వేణుగోపాలచారి నిర్మల్ నియోజకవర్గంలో క్రియాశీలం అయ్యేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎలాంటి సందర్భం లేని ప్రస్తుత సమయంలో ఆయన తానూ మళ్లీ క్రియాశీలక రాజకీయాలను నిర్వర్తిస్తానని, కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేస్తానని అలాగే రాబోయే ఎన్నికల్లో ఏదో నియోజకవర్గం నుంచి పోటీ కూడా చేస్తానంటూ ప్రకటించి కాంగ్రెస్ పార్టీలో కొత్త చర్చకు దారి తీశారు.

తన పని తానూ చేసుకుపోతున్న డీసీసీ ప్రసిడెంట్

ఓ వైపు అంటి ముట్టనట్లుగా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వ్యవహారశైలితో పాటు ప్రస్తుతం వేణుగోపాలచారి వ్యవహరిస్తున్న తీరు పట్ల డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఎక్కడ కూడా నోరు జారడం లేదు. మొదట్లో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే విషయమై శ్రీహరిరావు వర్గీయులు పెద్ద ఎత్తున వ్యతిరేకించారు. ఈ విషయమై వారు ఆందోళనలు కూడా చేపట్టారు. అయితే పార్టీ శ్రీహరిరావును ఒప్పించి ఇంద్రకరణ్‌రెడ్డిని పార్టీలో చేర్చుకుంది. వీరి మధ్య సయోధ్య కూడా కుదుర్చింది. అయినప్పటికీ ఇంద్రకరణ్‌రెడ్డి శ్రీహరిరావుల మధ్య ఆశించిన రీతిలో సఖ్యత కనిపించడం లేదంటూ పార్టీ వర్గాలు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నాయి. ఇందులో భాగంగానే కొద్దిరోజుల క్రితం అయిల్ ఫాం ఫ్యాక్టరీ విషయంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అడ్డుకుంటున్నారన్న ఆరోపణలతో ఇంద్రకరణ్‌రెడ్డి డీసీసీ అధ్యక్షునికి సమాచారం ఇవ్వకుండా మాజీ మంత్రి హోదాలో ధర్నా చేపట్టడం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అలాగే ప్రస్తుతం వేణుగోపాలచారి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉందని తానూ పార్టీని బలోపేతం చేస్తానని దీనికి తోడుగా ఎన్నికల్లో సైతం పోటీ చేస్తానంటూ ప్రకటించి కొత్త చర్చకు దారి తీశారు. అయితే వీరిద్దరి విషయంలోనూ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఎక్కడ కూడా నోరు జారకుండా పార్టీ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తూనే కార్యకర్తలందరికి అందుబాటులో ఉంటున్నారు. దీనికి తోడుగా ఆయన ప్రభుత్వపరంగా జిల్లాలోని అన్ని సంక్షేమ కార్యక్రమాలు సైతం పకడ్బందీగా అమయ్యేలా చూస్తున్నారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీలో నాయకుల సంఖ్య పెరిగిపోతుండడం వారు చేపడుతున్న కార్యక్రమాలు ప్రకటనలు ఆ పార్టీ కార్యకర్తలను అయోమయానికి లోను చేస్తున్నాయంటున్నారు.



ఉత్సవ విగ్రహాలతో భక్తులు

శ్రీగిరి క్షేత్రంలో రథోత్సవం

నిర్మల్ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీగిరి క్షేత్రంలో మంగళవారం కావడిసేవ, రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పంచామృతాభిషేకం, ఇత్యాది పూజా కార్యక్రమాలు చేపట్టారు. గురుమాత రాజేశ్వరిదేవి, వీర సత్యనారాయణ స్వామి, సముందర్‌పల్లి కిషన్, గణేష్, సరేష్, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ధర్నాలో పాల్గొన్న జిల్లా నాయకులు



ఢిల్లీలో జరిగిన ధర్నాలో పాల్గొన్న జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సమరసింహారెడ్డి

నిర్మల్ అర్బన్/కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మంగళవారం యువజన కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సమరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, 15 లక్షల రూపాయలు అకౌంట్‌లో వేస్తానని చెప్పి ఇంతవరకు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ పనిముట్ల కోసం

మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలి



వ్యవసాయ అధికారి నవీన్

పెంబి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సబ్సిడీలో వ్యవసాయ పనిముట్ల కొరకు అర్హులైన మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని పెంబి మండల వ్యవసాయ అధికారి నవీన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... ఈ పథకంలో భాగంగా మహిళలకు 50 శాతం సబ్సిడీ వర్తించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళా రైతులు దరఖాస్తు ఫారంతో పాటుగా పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ పోర్టు సైజ్ ఫోటోలతో మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు పాటించాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు పాటించాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ సూచించారు. మంగళవారం ఆయన స్కానింగ్ కేంద్రం తనిఖీ చేశారు. పీసీ, పీఎన్‌డీటీ నియమ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

పురుగుల మందు తాగి

యువకుడి ఆత్మహత్య



అశోక్ (ఫైల్)

దస్తురాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొడిసిర్యాల గ్రామానికి చెందిన నేరెళ్ల అశోక్(24) అనే యువకుడు మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... మృతుడి చిన్నాన్న కుమారుడు గతంలో పురుగుల మందు తాగి చనిపోయాడు. కాగా వీరిద్దరూ సోదరులే కాకుండా మంచి మిత్రులు. ఈ క్రమం అతని మరణాన్ని తట్టుకోలేక అప్పటి నుండి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. దీంతో అశోక్ కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మంచిర్యాల జిల్లా జన్నారంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

టిప్పర్, బైక్ ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు



దస్తురాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుట్టాపూర్ గ్రామ పంచాయతీలోని చెన్నూర్ గ్రామంలో మంగళవారం ఎదురెదురుగా వస్తున్న టిప్పర్, బైక్ ఢీకొన్నాయి. స్థానిక ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ ప్రమాదంలో చెన్నూర్ గ్రామానికి చెందిన జి. శంకర్ గౌడ్, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన రాకేష్‌గౌడ్‌కు గాయాలయ్యాయి. కాగా వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. శంకర్ తల్లి పోసవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు



లక్ష్మణచాంద, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో గుడిమెల రాజు అనే ట్రాన్స్‌కో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం నర్సాపూర్ (డబ్ల్యూ)లో తన విధులను ముగించుకొని నిర్మల్ వైపు వెళ్తూ కనకాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు జరుగుతున్న చోటికి వెళ్లటానికి రైట్ టర్న్ తీసుకున్నాడు. ఇంతలోనే వేగంగా వస్తున్న కారు రాజు నడుపుతున్న బైక్ ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన రాజును హైదరాబాద్ తరలించారు. విషయం తెలిసిన మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనిధి రుణ బకాయిల వసూళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీనిధి రుణ బకాయిల వసూలును త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మంది రంలో శ్రీనిధి రుణాలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అద నపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నిర్ణీత గడువులోగా శ్రీనిధి రుణాల వసూలు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా మహిళా సంఘాల సంఖ్య, మంజూరు చేసిన రుణాలు, ఇప్పటి వరకు సంఘాలు చెల్లించిన బకాయిలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, శ్రీనిధి ప్రాంతీయ సమన్వకర్త సరిత, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఎస్పీ జానకి షర్మిల
- పోలీసుస్టేషన్‌లకు పరికరాల అందజేత



ట్రాఫిక్ నియంత్రణ పరికరాలు అందిస్తున్న ఎస్పీ

నిర్మల్ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఎస్పీ జానకీషర్మిల కోరారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ట్రాఫిక్ నియంత్రణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని పోలీసుస్టేషన్‌లకు ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన పరికరాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ మిషన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పట్టణంలో అత్యాధునిక సీసీ కెమెరాలతో ట్రాఫిక్‌ను నియంత్రించనున్నట్టు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపవద్దని, రాంగ్‌రూట్‌లో ప్రయాణించవద్దని సూచించారు. ముగ్గురితో ప్రయాణం ప్రమాదకరమని, సెల్ ఫోన్ మాట్లాడుతూ అతివేగంగా నడపడంతో అనుకోకుండా ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఎదుటి వారి ప్రాణాలకు ప్రమాదమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏఎస్పీ అవినాష్ కుమార్, రాజేష్ మీనా, ఇన్స్‌పెక్టర్లు అజయ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, సైలు, గోపినాథ్, ప్రవీణ్ కుమార్, కృష్ణ, మల్లేష్, సమ్మయ్య, ఆర్ఐలు రాం నిరంజన్, శేఖర్, రామకృష్ణ, రమేష్, ఏవో యూనిస్ అలీ, పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

- డీపీవో శ్రీనివాస్

కుభీర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న మహాత్మ జాతీయా ఉపాధిహామి పథకం పనులను కూలీలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలో సాంగ్వీ గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధిహామి పనులను పరిశీలించారు. కూలీలు ఉదయం త్వరగా పనులకు రావాలని సూచించారు. పని చేసేకూలీలకు క్షేత్ర స్థాయిలో తాగు నీటి వసతి, షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో నవనీత్‌కుమార్‌కు సూచించారు. అనంతరం మండలంలోని చొండి జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. మొక్కల్లో కలుపు మొక్కలను తొలగించి క్రమం తప్పకుండా నీటిని ఏపుగా ఎదిగేలా చూడాలన్నారు. గ్రామంలో బకాయి పడ్డ ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేసి పారిశుధ్య నిర్వాహణ, తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అక్కడి పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నవనీన్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, ఏపీవో రమేష్, ఏపీవో హరిలాల్, తదితరులున్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

భైంసా రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మీర్జాపూర్ శివారులో ఏర్పాటు చేసిన నర్సరీని మంగళవారం ఆయన సందర్శించారు. నర్సరీలో ఏప మొక్కలు పెంచుతున్నారో పరిశీలించారు. మొక్కలకు ఎప్పటికప్పుడు నీళ్లు పోస్తూ ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిచ్చి మొక్కలు పెరి గితే వెంటనే తొలగించాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కలకు గాలి తగిలేలా షెడ్‌లను చేయాలని సూచించారు. ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, తదితరులున్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

ముథోల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులను కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో శిరీషారెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చించాల, పిప్రి, వెంకటాపూర్ గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అక్కడ కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎండలు పెరిగిపోవడంతో రైతులు ఉదయం సమయంలోనే పనులు పూర్తి చేసుకొని ఇంటికి చేరు కోవాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా పనులు ముందే ముగించాలన్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ కొరకు టెంట్ లేదా పందిర్లు ఏర్పాటు చేయడంజరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా ఆసక్తి గలవారు పశువుల పాక, కోళ్ల షెడ్లు, గొర్రెల పాక, ఫారం పాండ్, ఫిష్ పాండ్, ఇంకుడు గుంతలు నిర్మించుకున్నట్లయితే పూర్తి సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌లో

ఖానాపూర్ మండలాన్ని మొదటిస్థానంలో నిలపండి



మస్కాపూర్‌లోని ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్‌ను పరిశీలిస్తున్న సీపీవో జీవరత్నం

ఖానాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులలో ఖానాపూర్ మండలాన్ని మొదటిస్థానంలో నిలిపేలా పనిచేయాలని పంచాయతీ కార్యదర్శులకు సీపీవో జీవరత్నం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్‌లో నిర్వహిస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని చందు నాయక్ తండా, తర్లపాడ్, పాత తర్లపాడ్, మస్కాపూర్ గ్రామాల్లో ఉన్న ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 31వ తేదీలోపు ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు చెల్లించిన వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పించిన విషయాన్ని ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి చిక్యాల రత్నాకర్ రావు, తదితరులున్నారు.

'ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు మంత్రి పదవి ఇవ్వాలి'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం

ఖానాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కాబోయే మంత్రివర్గ విస్తరణలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ఖానాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అడవుల జిల్లా ఆదిలాబాద్‌ను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేలా ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు మంత్రి పదవి ఇస్తే బాగుంటుందన్నారు. ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుకు ఖచ్చితంగా అధిష్టానం మంత్రి వర్గంలో బెర్తును ఖరారు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇస్తే ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని ఖానాపూర్ ప్రజలు భావిస్తున్నారన్నారు. ఇక్కడ ప్రజలు, పార్టీ శ్రేణుల మనోగతం మేరకు పార్టీతో పాటు ప్రభుత్వ పెద్దలు ఈ దిశగా ఆలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కావలి సంతోష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జన్నారపు శంకర్, పరిమి సురేష్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సలీం ఖాన్, తదితరులున్నారు.

ఆయిల్ పామ్ పంటలపై అవగాహన

నర్సాపూర్(జి), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఆయిల్ పామ్ పంటలపై కుంటాల, నర్సపూర్ తదితర మండలాల రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి రమణ, రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ పంటల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో హార్టికల్చర్ అధికారి జావిద్ పాషా, మౌనిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వేణుగోపాల కృష్ణకు ఎన్‌ఏబీఎల్ సర్టిఫికెట్ ప్రదానం

నిర్మల్ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేస్తున్న వేణుగోపాలకృష్ణ మంగళవారం నిజామాబాద్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ చేతుల మీదుగా ఎన్ఏబీఎల్ సర్టిఫికెట్ అందుకున్నారు. అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాల సంస్థ నిర్వహించే శిక్షణ ల్యాబ్‌ల నిర్వహణపై వేణుగోపాలకృష్ణ అర్హతలు సాధించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.